క్లుప్తంగా

కురంగేశ్వరస్వామికి లక్ష రుద్రాక్ష పూజ


ప్రత్యేక అలంకరణలో కురంగేశ్వరస్వామి

తాళ్లరేవు: మండల పరిధిలోని పాతకోరంగి గ్రామంలోని పురాతన శివాలయంలో ఆదివారం లక్ష రుద్రాక్ష పూజను వైభవంగా నిర్వహించారు. పవిత్ర మాసశివరాత్రి సందర్భంగా బాలాత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామివారికి ఆలయ అర్చకులు కేఆర్‌కే సాయిప్రసాద్ ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి లక్ష రుద్రాక్షలతో పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పోలీస్ శాఖలో 305 మంది బదిలీ

యానాం: మాహే, కారైకల్, యానాం, పుదుచ్చేరి పోలీస్‌స్టేషన్లలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 305 మంది పోలీసులను బదిలీ చేస్తూ పుదుచ్చేరి పోలీస్‌శాఖ ఆదివారం ఆదేశాలు జారీచేసింది. ప్రధానంగా మూడేళ్లుగా అదే స్టేషన్‌లో పనిచేస్తున్న వారిని బదిలీ చేశారు. ఇందులో ఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉన్నారు. పుదుచ్చేరి డీజీపీగా షాలినీసింగ్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ బదిలీలు నిర్వహించారు. కొద్దిరోజుల క్రితం అనూహ్యంగా 100 మంది పోలీసులకు బదిలీ ఉత్తర్వులు ఇచ్చి వెనువెంటనే వాటిని రద్దు చేసిన సంగతి తెలిసిందే.

ప్రభుత్వాసుపత్రుల్లో భద్రతకు చర్యలు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు, మెడికల్ కళాశాలల్లో భద్రత, రక్షణాత్మక చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల కోల్‌కతాలో సీనియర్ ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు ఉన్నతస్థాయి సలహా సంఘ సమావేశం ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శరత్‌చౌహాన్ అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రోజూ మూడుసార్లు పెట్రోలింగ్ నిర్వహించడం, మెడికల్ సిబ్బంది, పోలీస్‌శాఖతో కలిపి వాట్సాప్ గ్రూప్ నిర్వహించడం తదితర చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

ఆజాద్ ఫౌండేషన్‌చే మొక్కల పంపిణీ


మొక్కలను పంపిణీ చేస్తున్న ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం మొక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. గానుగ, వేప, రావి, మర్రి, అనంత రుధిర, చింత, మామిడి, ఉసిరి, అల్లనేరేడు, రామా ఫలం తదితర రకాల మొక్కలను ప్రజలకు పంచిబెట్టారు. కడియం నర్సరీ యాజమానుల సహకారంతో మొక్కలు పంపిణీ చేశామని ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యల్లమిల్లి నాగ సుధాకొండ తెలిపారు. కార్యక్రమంలో ఆజాద్ ఫౌండేషన్ ప్రతినిధులు అడ్డాల గోపాలకృష్ణ, రంకిరెడ్డి కాశీ, ఈమని శర్మ, కొత్తపల్లి వంశీ, చింతపల్లి చిన్నా, నిమ్మకాయల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సామాజిక భవనం నిర్మాణానికి కృషి


రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ హరీష్ మాథుర్, ఎమ్మెల్యే సుబ్బరాజులను సత్కరిస్తున్న శెట్టిబలిజ సంఘం నాయకులు

తాళ్లరేవు: తాళ్లరేవులో శెట్టిబలిజ సామాజిక భవనం నిర్మాణానికి కృషి చేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఆదివారం స్థానిక సూర్య భాస్కర కల్యాణ మండపంలో శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజులను దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ తమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఎంపీపీ రాయుడు సునీత, టేకుమూడి లక్ష్మణరావు, గంజా సూరిబాబు, పిల్లి సత్తిబాబు, కట్టా త్రిమూర్తులు, చీకట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల గీత దాటితే చర్యలే

- నవరాత్ర ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు
- ఎక్కడికక్కడ సిద్ధమవుతున్న చలువ పందిళ్లు
- ఉత్సవ కమిటీలకు నిబంధనలు వివరిస్తున్న పోలీసు శాఖ


ముమ్మిడివరం గేటు సెంటరులో సిద్ధమవుతున్న గణపతి నవరాత్ర ఉత్సవాల చలువ పందిరి


అమలాపురం గడియారం స్తంభం సెంటరులోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేస్తున్న చలువ పందిరి

అమలాపురం టౌన్: గణపతి నవరాత్ర ఉత్సవాలకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. గణపతి చలువ పందిళ్ల పరంగా గతం నుంచి ఉన్న నిబంధనలు వర్తింపజేస్తూనే ఉత్సవాలతో పాటు నిమజ్జనం, ఊరేగింపుల విషయంలో పోలీసు శాఖ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. తొమ్మిది రోజులూ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునేందుకు బందోబస్తు పరంగా పూర్తి సహకారం అందిస్తామని, అయితే నిబంధనల అమలుకు కూడా ఉత్సవ కమిటీలు అంతే బాధ్యత వహించాలని పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా నిబంధనల పరిమితుల గీత దాటితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. గతంలో ఉత్సవాలకు పలు అనుమతులు వివిధ శాఖల నుంచే తీసుకునే విధానం ఉండేది. ఇప్పుడు సింగిల్ విండో విధానం ద్వారా ఒకే చోట ఒకేసారి అనుమతులు లభించే వెసులుబాటు తీసుకొచ్చారు.

విగ్రహాల ఎత్తు పది అడుగుల వరకే

అమలాపురం, ముమ్మిడివరం నియోజకర్గంలో 12 చోట్ల భారీ ఎత్తున, దాదాపు 160 చోట్ల సాధారణ స్థాయిలో గణపతి నవరాత్ర ఉత్సవాలు నిర్వహించేందుకు ఆయా ఉత్సవ కమిటీలు సమాయాత్తమవుతున్నాయి. ఈ నెల 7వ తేదీన జరిగే వినాయక చవితి రోజున ఉత్సవాలను ప్రారంభించి నవరాత్ర మహోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం ప్రతిచోటా చలువ పందిళ్లు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అడుగు నుంచి పది అడుగుల ఎత్తు ఉన్న గణపతి విగ్రహాలకు ఆర్డర్లు ఇచ్చి వాటిని చలువ పందిళ్లలో ప్రతిష్ఠించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఉత్సవాలకు అమలాపురానికి వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. ఉత్సవాల నిర్వహణలో పట్టణానికి ఓ ప్రత్యేకత ఉంది. గడియారం స్తంభం సెంటరు, బులియన్ అసోసియేషన్, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో గణపతి ఉత్సవాలు భారీ ఎత్తున చేయడం సంప్రదాయంగా వస్తోంది. భారీ సెట్టింగ్‌లతో ఈ చలువ పందిళ్లను సిద్ధం చేస్తున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో మురమళ్ల రాఘవేంద్ర వారధి, యానాం-ఎదుర్లంక వారధి, అన్నంపల్లి టోల్ గేట్ వద్ద గణపతి ఉత్సవాలు భారీగా నిర్వహించనున్నారు. ముమ్మిడవరం మండలం గాడిలంక గ్రామం వినాయక విగ్రహాల తయారీకి పెట్టింది పేరు. కోనసీమలో చాలా వరకూ ఉత్సవ కమిటీలు గాడిలంక నుంచే విగ్రహాలకు ఆర్డర్లు ఇచ్చారు.

ఉత్సవాల నిబంధనలు ఇలా

- పోలీస్, ట్రాన్స్‌కో, మున్సిపాలిటీ లేదా గ్రామ పంచాయతీ తదితర శాఖల నుంచి అనుమతులు సింగల్ విండో విధానం ద్వారా కలెక్టరేట్‌లో ఒకేసారి పొందాలి.
- తొమ్మిది రోజులూ కమిటీ ప్రతినిధులు చలువ పందిళ్లలోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తూ ఉండాలి. ప్రధానంగా చలువ పందిళ్ల వద్ద రాత్రి సమయాల్లో ఉత్సవ కమటీ ప్రతినిధులు గస్తీ ఉండాలి. ఎలాంటి గొడవలు, కుల, మత వివాదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- చలువ పందిరి ఎంత విస్తీర్ణంలో వేస్తున్నారు, అది ప్రధాన రోడ్డా, అంతర్గత రోడ్డా వంటి వివరాలు అనుమతుల్లో తెలియజేయాలి. గణపతి విగ్రహాలు అడుగు నుంచి పది అడుగుల ఎత్తుకు మించకూడదు.
- ఉత్సవాల్లో డీజేలు(మైక్‌ల సౌండ్ సిస్టమ్) ఉపయోగించి ప్రజలకు అసౌకర్యం కలిగించకూడదు. ఉత్సవాలు, ఊరేగింపుల్లో అశ్లీల నృత్యాలకు తావుండటానికి వీల్లేదు.
- నవరాత్రులయ్యాక గణపతి విగ్రహాల నిమజ్జనం, ఊరేగింపుల రూటు, ఎక్కడ నిమజ్జనం చేసేది వంటి వివరాలు అనుమతుల్లో ముందుగానే పొందుపరచాలి. ఈతరాని భక్తులను కాల్వలు, నదుల్లోకి దిగకుండా కమిటీ ప్రతినిధులు జాగ్రత్తలు తీసుకోవాలి.

సామరస్యంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలి



గణపతి నవరాత్ర ఉత్సవాలను ఎలాంటి వివాదాలు, ప్రమాదాలకు తావు లేకుండా సామరస్య వాతావరణంలో జరుపుకోవాలి. ఉత్సవ కమిటీలు ముందుగా సింగిల్ విండో ద్వారా అనుమతులు విధిగా పొందిన తరువాతే ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోవాలి. అనుమతులు తీసుకోకుండా నిబంధనల గీత దాటితే కమిటీ ప్రతినిధులనే బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటాం.

– కె.క్రిస్టోఫర్, పట్టణ సీఐ, అమలాపురం

సీపీఎస్ రద్దు చేయాలంటూ నిరసన



అమలాపురంలో నిరసన తెలుపుతున్న ఎస్టీయూ జిల్లా శాఖ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఎస్టీయూ శాఖకు చెందిన ఉపాధ్యాయులు స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఆదివారం సాయంత్రం నిరసన తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం ప్రతిపాదించే మరే ప్రత్యామ్నాయ విధానాలను ఆమోదించబోమని జిల్లా ఎస్టీయూ శాఖ స్పష్టం చేసింది. నిరసనలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు ఎన్.శివప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోలిశెట్టి దొరబాబు, సరిదే సత్య పల్లంరాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నల్లా రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాంబాబు, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎన్వీ సత్యనారాయణ, అభయ కన్వీనర్ ఆర్ఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సత్కారం


కార్యదర్శి సత్యబాబ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు తదితరులు

అమలాపురం రూరల్: భట్నవిల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన సత్యబాబ్‌కు ఆదివారం స్థానిక సచివాలయంలో గ్రామ ప్రజలు, తోటి ఉద్యోగులు సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ గత 35 ఏళ్లగా కార్యదర్శిగా పనిచేస్తున్న సత్యబాబ్ గ్రామాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు మంద గెద్దయ్య, చొల్లంగి సాయిబాబు, కార్యదర్శులు రుద్రరాజు సూరపరాజు, బి.ఆదిశంకరం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష రుద్రాక్షార్చన


వీరేశ్వరుని ఆలయంలో రుద్రాక్షలకు పూజలు నిర్వహిస్తున్న పండితులు


ప్రత్యేక అలంకరణలో మురమళ్ల వీరేశ్వరస్వామి

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయం శివనామ స్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి తరువాత అంతటి పర్వదినమైన శ్రావణ మాసం మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం వీరేశ్వరునికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిపారు. ప్రముఖ శైవ క్షేత్రం కాశీ నుంచి తెచ్చిన లక్ష రుద్రాక్షలను గ్రామంలో మేళతాళాలతో ఊరేగించి పవిత్ర వృద్ధ గౌతమి నదిలో పూజలు, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దంపతులు పాల్గొని పండితులకు దీక్షా వస్త్రాలు అందజేశారు. ఆలయంలో ఉదయం వినాయకుని పూజ, పుణ్యాహవచనం, దీక్ష ధారణ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం, లక్ష సంఖ్యాక రుద్రాక్ష బిల్వాలతో పూజలు చేశారు. అనంతరం స్వామివారిని రుద్రాక్షలతో, మారేడు బిల్వాలతో, పచ్చిపూలతో చేసిన అలంకరణ భక్తులను మంత్రముగ్దులను చేసింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ప్రసాదం, రుద్రాక్షలు అందించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సుబ్రహ్మణ్యేశ్వరరావు సేవలు అభినందనీయం


సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న సహచర ఉపాధ్యాయులు

అమలాపురం రూరల్: గత 28 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన మెట్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు సేవలు అభినందనీయమని పలువురు వక్తలు ప్రశంసించారు. ఆదివారం అమలాపురం శివారులోని ఓ ఫంక్షన్ హాల్లో సుబ్రహ్మణ్యేశ్వరరావు ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి హాజరై సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు సహచర ఉపాధ్యాయులు మాట్లాడుతూ సుబ్రహ్మణ్యేశ్వరరావు సామంతకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ శనివారం ఉద్యోగ విరమణ చేశారన్నారు. ఆయన విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసేవారని కొనియాడారు. సుబ్రహ్మణ్యేశ్వరరావు అందించిన సేవలకు గాను 2014లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారని చెప్పారు.

పుదుచ్చేరి వ్యాప్తంగా కులగణన చేపట్టాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా కులగణన చేపట్టి ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని మాజీ సీఎం నారాయణసామి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవలం కాంగ్రెస్ పార్టీయే కాకుండా కేంద్ర మంత్రి చిరాగ్‌పాశ్వాన్, బీహార్ సీఎం నితీష్‌కుమార్ సైతం కుల గణన నిర్వహించాలని కోరుతున్నారన్నారు. ఇప్పటికే తమిళనాడు అసెంబ్లీ సైతం కులగణన చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. అలాగే పుదుచ్చేరిలో సైతం కులగణన చేయాలని డిమాండ్ చేశారు.

మందుబాబుల ఆగడాలను అరికట్టాలని వినతి

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో మందుబాబుల ఆగడాలను నియంత్రించాలని, అలాగే గంజాయి బ్యాచ్ చేస్తున్న దాడులను అరికట్టాలని కోరుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు పలువురు వినతి పత్రం అందజేశారు. ఆదివారం తాళ్లరేవులో పిల్లంక, గోవలంక, ఇంజరం, సుంకరపాలెం, నీలపల్లి తదితర గ్రామాలకు చెందిన నాయకులు మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించారు. శనివారం పిల్లంక ఏటిగట్టుపై గోపులంక వద్ద ముగ్గురు యువకులు మత్తులో నలుగురు వ్యక్తులపై బీరు సీసాలతో దాడి చేసి గాయపరిచారన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఏటిగట్టు రహదారితో పాటు సరిహద్దు ప్రాంతాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రిని కలిసినవారిలో వేలూరి కామేశ్వర శర్మ, జిత్తుగ శ్రీనివాస్, మోర్త భైరవమూర్తి, చీకట్ల నాగేశ్వరరావు, బోయిడి వేణుగోపాల్ తదితరులున్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే రక్షా హరికృష్ణ జయంతి


మాజీ ఎమ్మెల్యే హరికృష్ణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ మత్స్యకార నేత రక్షా హరికృష్ణ 84వ జయంతిని ఆదివారం సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రాజీవ్ రివర్ బీచ్ దారిలో నెలకొల్పిన రక్షా హరికృష్ణ విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి రక్షా హరికృష్ణ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్‌ఐ శేరు నూకరాజు, మత్స్యశాఖ ఏడీ గౌంతియ్య, పీఆర్ఏఓ కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మెట్టకూరు ఫిషర్‌మెన్‌పేటలో మాజీ ఎమ్మెల్యే రక్షా హరికృష్ణ విగ్రహానికి ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నీట మునిగిన కాలనీలు


పాదలాడలో ముంపునకు గురైన కంచి కామాక్షమ్మ కాలనీ


కేశవదాసుపాలెం శివారు అగస్టీన్ కాలనీలో ఇళ్ల వద్దకు పోటెత్తిన ముంపు నీరు

రాజోలు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో పలు కాలనీలు, పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. మండలంలోని సోంపల్లి డ్రైన్, చింతలపల్లి డ్రైన్‌లు ముంపు నీటితో పోటెత్తాయి. పాదలాడ కంచికామాక్షమ్మ కాలనీ పూర్తిగా ముంపునకు గురైంది. ముంపునీరు దిగకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు రోజులుగా మోకాలు లోతు నీటిలో ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ముంపునీరు దిగేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజోలు మండలంలో చింతలపల్లి, పొన్నమండ, కూనవరం, శివకోడు, బి.సావరం, కడలి గ్రామాల్లోని కాలనీలను వర్షం నీరు ముంచెత్తింది.

నియోజకవర్గంలో సుమారు 4,400 ఎకరాల్లో వరినాట్లు ముంపునీటిలో ఉన్నాయి. ముంపునీరు కారణంగా వరినాట్లు కుళ్లిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజోలు మండలంలో సుమారు 114 ఎకరాల్లో వేసిన వరినాట్లు ముంపునీటితో చెరువులను తలపిస్తున్నాయి.

వరి చేలల్లోని ముంపు నీరు దిగకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చింతలపల్లి, శివకోడు ప్రాంతాల్లో రైతులు కొందరు ఇంజిన్ల సాయంతో ముంపు నీటిని డ్రైన్లలోకి తోడుకుంటున్నారు.

ముంపు బారిన పడిన అగస్టీన్ కాలనీ

సఖినేటిపల్లి: మండల పరిధిలోని కేశవదాసుపాలెం శివారు అగస్టీన్ కాలనీ భారీ వర్షాలకు ఆదివారం ముంపు బారిన పడింది. ముంపు నీరు వెళ్లడానికి ఎటూ దారి లేకపోవడంతో ఇళ్లల్లోకి పోటెత్తింది. ఇళ్లల్లోని గదుల్లో సామాన్లు వర్షం నీటితో తడిసి ముద్దయ్యాయని స్థానికులు వాపోతున్నారు. కాలనీ చుట్టూ రొయ్యల చెరువుల సాగు వల్ల కూడా ముంపు నీరు చుట్టుముట్టిందని కాలనీవాసులు చెబుతున్నారు. ముంపు నీటిని మళ్లించేందుకు అధికారులు తక్షణం డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

వర్షం తగ్గినా వీడని ముంపు బెడద

మామిడికుదురు: భారీ వర్షాలు తగ్గుముఖం పట్టినా గ్రామాల్లో ముంపు బెడద మాత్రం ప్రజలను వెన్నాడుతూనే ఉంది. వాయుగుండం కారణంగా రెండు రోజుల నుంచి ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో ముంపు నీరు భారీగా నిలిచిపోయింది. మామిడికుదురులో జాతీయ రహదారి నుంచి ముస్లిం వీధికి వెళ్లే రోడ్డుపై భారీగా వర్షం నీరు నిలిచిపోయింది.


మామిడికుదురులో రోడ్డుపై నిలిచిపోయిన ముంపు నీరు

నగరం గ్రామంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మామిడికుదురు, నగరం, పాశర్లపూడి గ్రామాల్లో సైతం జాతీయ రహదారిపై సైతం ముంపు నీరు నిలిచిపోయింది. కరవాక గ్రామంలో పంచాయతీ అధికారులు కచ్చా డ్రైన్లు తవ్వించి ముంపు నీటిని బయటకు మళ్లించారు. మొగలికుదురు, గెద్దాడ, మామిడికుదురు ఆల్‌క్యాస్ట్ కాలనీల్లోనూ ముంపు నీటి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో 24 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

సనాతన ధర్మంపై విస్తృత ప్రచారం


హిందూ సమ్మేళన సభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి

మామిడికుదురు: మరుగునపడిన సనాతన ధర్మంపై విస్తృత ప్రచారం చేసి వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు కార్యాచరణ చేపడుతున్నామని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి ప్రయాగ నరసింహమూర్తి తెలిపారు. ఆదివారం మామిడికుదురులో 60 వసంతాల హిందూ సమ్మేళన ఉత్సవం మండల శాఖ అధ్యక్షుడు కూనపరెడ్డి రాము అధ్యక్షతన జరిగింది. ప్రజల్లో దేశభక్తితో పాటు దైవభక్తిని పెంపొందించడం, అంటరానితనం నిర్మూలించడం, ధార్మిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం వీహెచ్‌పీ ప్రధాన లక్ష్యాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచితంగా హోమియో వైద్య సేవలందిస్తున్న వలవల బాబ్జి, నయినాల అబద్ధం, బొక్కా సూర్యప్రకాశరావు, తుమ్మల పద్మాజీరావు, కంచర్ల గణపతిరావు, బత్తుల రమేష్ తదితరులను సత్కరించారు. సమావేశంలో వీహెచ్‌పీ ప్రతినిధులు పోలిశెట్టి ప్రసాద్, నూలు మురళీకృష్ణ, నూలు శ్యామల, సత్సంగ్ ప్రముఖ్ పాపాయిశర్మ, పెచ్చెట్టి భాస్కరరావు పాల్గొన్నారు.

ఎక్కడపడితే అక్కడ ఆటోలు ఆపేస్తే చర్యలు తప్పవు


ఆటో యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న సీఐ ప్రశాంత్‌కుమార్

అయినవిల్లి: ప్రయాణికులు ఎక్కడానికి, దిగడానికి ఎక్కడ పడితే అక్కడ సడన్‌గా బ్రేక్ వేసి రోడ్లపై ఆటోలు ఆపితే చర్యలు తప్పవని ఆటో యూనియన్ నాయకులను సీఐ డి.ప్రశాంత్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం అయినవిల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఆటో యూనియన్ నాయకులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల రోడ్లపై ఆటో ప్రమాదాలు ఎక్కువవుతున్నాయన్నారు. ఆటో డ్రైవర్లు అందరికీ డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, రోడ్డు ట్యాక్స్ వంటి పత్రాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మైనర్లకు ఆటోలు ఇవ్వడం, మద్యం తాగి ఆటోలు నడపడం వంటివి నేరమన్నారు. పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కె.మనోహర్ జోషి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.